ఆజానుభాహుడైన చైతన్యానంద ఎక్కడివాడో తెలీదు. కాని అక్కడ ప్రతి అనాథకీ తండ్రి..... వయస్సు ఏభై దాటిందో లేదో కాని నూరేళ్ళ వృద్ధుడిలా అనిపిస్తాడు. శరణాలయాన్ని నడుపుతున్నది అతడే అయినా అందరితో ఒకడిలా వుంటాడే తప్ప అందరికీ తను అధిపతినన్న ఆలోచన లేనివాడు.

శూన్యంలా నవ్వగలడు. అనంతలా అనిపిస్తాడు. నీరవంలా వుంటాడు. మనుషుల సమస్యల్ని గట్టెక్కించే తీరంగా దర్శనమిస్తాడు.

మొహంపై ముడతలు ఏ గతానికి చిహ్నాలో తెలీదు కాని ఆ ముడతల్ని కప్పిన గెడ్డం జీవిత సారానికి వచ్చిన వయసులా అనిపిస్తుంటే అందర్నీ అక్కున చేర్చుకుంటాడు. మక్కువతో మాటలాడి ఓదార్చగలడు.

"తెల్లవారింది వెలుగు రేకలు విచ్చుకుంటున్నాయి" మృదువుగా పలికాడాయన. "ఇంకా చీకటిలో వున్నట్టు ఆ నిర్వేదం ఏమిటి. . ."

నర్మగర్భంగా ఏ జీవిత సత్యాన్నో చెబుతున్నట్టుగా అన్నారు "పసిపిల్లల చేత ప్రార్థనా గీతం పాడించాలి విశ్వా. . . వెళ్ళిరా. . ."

తలవంచుకున్నాడు విశ్వా.

"రాత్రి నిద్రపోలేదు కదూ" పరామర్శగా అడిగాడాయన.

"చాలా రాత్రులుగా నిద్రపోవటం లేదు బాబా" విశ్వ గొంతులో నిట్టూర్పు.

"అంటే ఇంకా గతంలోనే బ్రతుకుతున్నావన్న మాట" జవాబు చెప్పలేదు విశ్వ.

"జీవితమంటే గతం కాదు. వర్తమానం."

"రాజీపడలేకపోతున్నాను."

"అంటే ప్రకృతికి భిన్నంగా ఆలోచిస్తున్నావన్నమాట" ఆప్యాయతగా విశ్వ తల నిమిరాడు చైతన్యానంద. "మనిషి జీవితానికి అర్థం గతమే అయితే నువ్వింకా అమ్మ పొత్తిళ్ళలో పసికందుగానే వుండిపోవాలి విశ్వా. నడక నేర్చావు, నవ్వు నేర్చావు. . . ఇంత వాడివయ్యావు. . . మరి ఇంకా గతంలోనే బ్రతుకుతానంటే ఎలా..... బ్రతకాల్సింది వయసు మనసు పెరగని పసిబిడ్డలా కాదు. అహంకార అభిమాన రహితుడైన పసికందు ఆలోచనలతో... "

"బాబా. . ." ఉద్విగ్నంగా తలపైకెత్తాడు "మీ ఆధ్యాత్మిక చింతనల గురించి మీ కార్యాచరణ చర్చల గురించి నాకు అవగాహన లేదు. మీ దృష్టాంతాల లోతుల గురించి గాని వేదోపనిషత్తుల వితరణ గురించి తెలుసుకోగలిగే శక్తి నాకు లేదు. నాకు తెలిసింది ఒక్కటే. . . నాకు జన్మ నిచ్చీ నేలరాలిన నా తండ్రి పిచ్చి దైన నా తల్లి పగిలిన నా స్వప్నాలు మిగిలిన శకలం లాంటి గతం. . . అంతే. . ."

స్వప్నంలో నిలబడి స్వప్నాన్ని ప్రశ్నిస్తున్న విశ్వ ఆవేశాన్ని ప్రేక్షకుడిలా గమనిస్తూ వుండిపోయాడు చైతన్యానంద . . .

నడుస్తున్న విశ్వని చూస్తూ.

సరిగ్గా అదే సమయానికి . . .

రామనాథచౌదరి తన భవంతిలో కూర్చుని ఆ రోజు దిన పత్రిక చదువుతున్నాడు.

అతడికి అభిముఖంగా వున్నాడు అతని కొడుకు రాజేంద్ర.

"క్విజ్ కిడ్ రాజేంద్రపై ఛాలెంజ్. . .

రెండు లక్షల రూపాయల్ని వెచ్చించటానికి సిద్ధపడుతూ మొన్న ఓడిన విశ్వనాథ్ మళ్ళీ విసిరిన సవాల్. . .

ఆదివారం సాయంకాలం ఆరు గంటలకి యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించబడే ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేస్తున్నది కృషి ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ఛైర్మన్ శ్రీ ఉపాధ్యాయ. . ."

ఇదే వార్తని అప్పటికి చాలాసార్లు చదివాడు రామనాథ్‌చౌదరి. అది కాదు చౌదరిని అంతగా కదిలించింది.

ఎక్కడో స్టేట్స్‌లో చదువుకుంటూ యీ మధ్యనే ఇండియా వచ్చిన కృషి తన కొడుకుని అవమానించి తన వునికిని ప్రశ్నించింది.

తిరుగులేని తన సార్వభౌమాధికారానికి ఓ ఆడపిల్ల విఘాతం కలిగిస్తానంటూంది.

పడకటింటికి పరిమితం కావాల్సిన ఓ అమ్మాయి తన కొడుకుపై కాదు తన మగతనంపై ఓ సవాల్ విసిరింది.

అధికార పార్టీకి ఆత్మీయుడిగా చాలా పరిశ్రమలకి అధిపతిగా నేర ప్రపంచాన్ని సైతం శాసించగల ప్రముఖుడిగా తనకున్న పరపతి తెలిసి వుండీ తాతయ్యకి బాసటగా నిలిచి తన ప్రత్యేకతని నిరూపించు కోవాలనుకుంటుంది.

చౌదరి ఆలోచనల్లో మునిగి వుండగానే లోపలికి దూసుకొచ్చాడు లాయరు రంగధాంతో పాటు ఎమ్మెల్యే రాజారావు. . .

సుమారు పాతికదాకా హత్యా నేరల్తో సంబంధంగల రాజారావు యిప్పటికీ గూండాల నాయకుడిగానే చలామణీ అవుతున్న వాడైతే ఆ కూటమి చేసే ప్రతి హత్యాకాండకి చట్టబద్దమైన గైడెన్స్ యిచ్చే ప్రముఖ క్రిమినల్ లాయరు రంగధాం. . .

పేపరు చూడగానే తాను ఫోన్ చేయడంతో పది నిముషాలకల్లా అక్కడ ప్రత్యక్ష మైపోయి స్నేహితుల్ని చూస్తూ అన్నాడు చౌదరి.

"ఇది నిజానికి ఓ పెద్ద సమస్యగా నేను భావించడం లేదు"

ప్రతి సమస్య గురించీ ఇలాగే చర్చించడం చౌదరికి అలవాటు. "అయితే చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలనే ఆలోచన గలవాడ్ని కావడంతో మిమ్మల్ని పిలిచాను..."

చెప్పాడు క్లుప్తంగా . . .

కార్మిక నాయకుడిగా వున్న ఫ్యాక్టరీలో స్ట్రయికు చేయించడం గానీ అయితే ఉత్సాహంగా రియాక్టయ్యేవాడు కాని యిలాంటి పోటీల గురించి పెద్ద అవగాహన లేదు. లాయరు రంగధాం కేసి చూశాడు యీ వ్యవహారంలో తన బాధ్యతేమిటో సలహా యిమ్మన్నట్టుగా.

"అసలు ఈ సమస్య విషయంలో మీరెందుకింత ఆందోళన పడుతున్నదీ నాకు అర్థం కావడం లేదు. ఎందుకంటే రాజేంద్రని ఐక్యూ పోటీలో ఓడించడం అంత సులభం కాదు కాబట్టి.... " రంగధాం యధాలాపంగా అన్నాడు చర్చకి ఉపోద్ఘాతంలా.

"రంగధాం. . . నాకు గెలుపంటే చాలా యిష్టం" సాలోచనగా చూసాడు చౌదరి.

"కాబట్టే మొన్న గెలిచారుగా"

"కాని అది డబ్బుతో. . ." చాలా అయిష్టంగానే చెప్పాడు విశ్వని ఎలా కొనేసింది...

"ఈ సారి కూడా కొనేస్తే సరి."

"కాని అంత సులభం కాదు. ఎందుకంటే విశ్వ డబ్బుకు అమ్ముడుపోయే మనిషిగా కృషి గుర్తించింది. కాబట్టి, ఏదో నమ్మకమే లేకపోతే పోటీకి అతడ్ని దింపే అవకాశం లేదు కాబట్టి"

"రాజేంద్ర గట్టిగా ప్రిపేరైతే బెటరనుకుంటాను"

"ఈ బోడి సలహాలు నాకు అక్కర్లేదు రంగధాం"

ఇంచుమించు కసురుకుంటున్నట్టుగా అన్నాడు చౌదరి "ఆ రోజు ఆ చివరి ప్రశ్నకి గాని విశ్వ జవాబు చెప్పి వుంటే రజేంద్ర ఓడేవాడు.

"అసలు ఆ చివరి ప్రశ్న దాకా విశ్వ తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు అంటే అర్థం ఏమిటి. . . తను మేధావినని పరోక్షంగా తెలియచెప్పడమేగా. తెలియచెప్పడమే కాదు రంగధాం. విశ్వ సామాన్యుడు కాడు. నిజంగా మేధావి. ఆ విషయంలో సందేహంలేదు. కాబట్టే కృషి కూడా పనిగట్టుకుని అతడ్ని రంగంలోకి దింపిందని నా అనుమానం. "

ఆవేశాన్ని నిభాయించుకోలేనట్టు పచార్లు చేస్తూ అన్నాడు "ఇక్కడ నేను ఆలోచిస్తున్నది రెండు లక్షల రూపాయల గురించి కాదు. . . ఓటమిలేని నా ప్రతిష్ట గురించి. ఒకవేళ రాజేంద్ర ఓడితే నా ఉనికి మాత్రమే కాదు రామనాథ చౌదరి కొడుగ్గా- రాష్ట్రంలో ఏ ఒక్కడూ ఓడించలేని ఏకైక ఛాంపియన్‌గా మూడేళ్ళనుంచి రాజేంద్రకున్న పేరు ప్రఖ్యాతలూ మంట కలిసిపోతాయి. అదొక్కటే కాదు రంగధాం. . . ఉపాధ్యాయ ముందు తల వంచుకోవటం ఈ చౌదరి కోరనిది, జరగకూడనిది. . ."

మరో గెలుపు కోసం ముఖ్యంగా ఉపాధ్యాయపై గెలుపు కోసం చౌదరి ఎంత కలవరపడుతున్నదీ అర్థమైంది రంగధాం ఏదో చెప్పబోతుండగానే అక్కడ ఫోన్ రింగయింది.

మామూలుగా అయితే చౌదరి ఆ క్షణంలో ఫోన్ గురించి పట్టించుకునేవాడు కాదు కాని రింగవుతున్నది తన పర్సనల్ ఫోన్. చాలా కొద్ది మంది మాత్రమే మాట్లాడే కాన్ఫిడెన్షియల్ నెంబరది.

రిసీవర్ అందుకున్నాడు అసహనంగా "ఎవరది"

"నేను. . . కృషి . . . ఉపాధ్యాయ గ్రాండ్ డాటర్‌ని"

ఉన్నట్టుండి చౌదరి మొహం జేవురించింది. ఓ పిల్ల కాకి సరాసరి పులితో మాట్లాడే సాహసం చేస్తుంది. "చెప్పు నాకెందుకు ఫోన్ చేసావ్"

"చాలా టెన్షన్‌లో వున్నట్టున్నారు"

చౌదరి పిడికిలి బిగుసుకుంది "ఏ విషయంలో"

"మీ ముందున్న పేపరులో రాయబడింది దాని గురించి"

సన్నగా వినిపించిన కృషి నవ్వు చౌదరి రక్త ప్రసరణ వేగాన్ని పెంచింది. "నువ్వు మాట్లాడుతున్నదెవరితోనో తెలుసనుకుంటాను"

"యస్. తెలుసు. ఒకప్పుడు పారిశ్రామిక వేత్తతో. ఓటమి అంటే భయపడుతూ డబ్బుతో గెలుపును కొనుక్కోగల ఓ సూడో ఇంటిలెక్చువల్ రాజేంద్ర తండ్రితో. . ."

ఇదో విచిత్రమైన అనుభవం అతడికి. . .

అత్యున్నత స్థానంలో వున్న బ్యూరో క్రాట్స్ రాజకీయ నాయకులు సైతం భయపడే తనతో మామూలుగా మాట్లాడ్డం లేదు కృషి. ఆకతాయిగా ఆడుకుంటూంది. "ఇప్పటికీ నేను నీపై గెలుపు సాధించగలను కృషి"

"మీ కృషి చాలదు"

"ఏమిటి నీకంత నమ్మకం"

"హై స్కూలు స్థాయి పరిజ్ఞానం గల మీ అబ్బాయి రాజేంద్రని ఇంతకాలం తెలివితోగాని డబ్బు విరజిమ్మి మొదటి స్థానంలో నిలబెట్టారని నాకు తెలుసు కాబట్టి."

"ఈ రోజూ విరజిమ్మగలను"

"కాని విశ్వనాథ్ లొంగడు"

"అంత పెట్టుబడి పెట్టావా"

"యస్. . . మీరు ఊహించలేనంత ధర చెల్లించబోతున్నాను"

"అంతకు పది రెట్లు నేనూ చెల్లిస్తాను"

"నేను చెల్లించేది నీ దగ్గర లేనిది. . ." . . . "నా దగ్గర మాత్రమే వున్నద"నలేదు కృషి..... ఎగతాళిగా నవ్వింది "సో. . .మీ జీవితంలో తొలిసారి ఓటమిని టేస్ట్ చేయబోతున్నారు . . . అదీ ఉపాధ్యాయ మనవరాలి మూలంగా"

"నో. . ." చౌదరి గావుకేకతో ఆ హాలు ప్రతిధ్వనించిపోయింది. "నేనే గెలుస్తాను"

"గావుకేకలతో గెలుపు గురించి మాట్లాడితే చాలదు మిస్టర్ చౌదరీ. . . మేధస్సంటే గూండాలూ దళారీలతో మెట్లెక్కడం కాదు."

"మిస్ కృషి. . ."

ప్రిపేరవ్వండి.  అంతవరకు ఆగలేకపోతే ఆది నిష్ఠూరం నయమనిపించేలా మీ అబ్బాయిని పోటీ నుంచి తప్పించండి".

"అసంభవం..." ఉక్రోషంగా కంపించిపోతున్నాడు చౌదరి "వాడు నా కొడుకు"

"నిరూపించు కోవాల్సిన సమయం ఆసన్న మైంది చౌదరిసాబ్..."

చౌదరికి చురుక్కు మనిపించేట్టు నిగూఢంగా మాట్లాడిన కృషి చివరిగా అంది "అందుకే నా మాట విని రాజేంద్రని పోటీ నుంచి విత్‌డ్రా కమ్మనండి.  లేదూ అంటే వేలమంది విద్యార్థుల సమక్షంలో మీ పరపతికి వస్త్రాపహరణం తప్పదు...ఓకే..."

ఫోన్ క్రెడిల్ చేసిన చప్పుడు...

అప్పటికే స్వేదంతో తడిసిపోయిన చౌదరి రిసీవరు విరిగేట్టు నేలపైకి విసిరేశాడు.

హఠాత్తుగా అక్కడ విశ్శబ్దం ఆవరించింది.

అంతసేపూ మాట్లాడిందెవరితోనో అందరికీ తెలిసిపోయింది. పైగా ఎంతగా కృషి రెచ్చగొట్టిందీ అన్న విషయమూ బోధపడి పోయింది.

"రంగధాం" గొంతు నాళాలు పగిలేట్టుగా అరిచాడు చౌదరి  "నా కొడుకు గెలవాలి..."

"గెలుస్తాడు" ధీమాగా హామీ యిచ్చాడు రంగధాం.

"ఎలా..."

"ఆ విషయం నాకు వదిలిపెట్టండి" ఎలాగో అర్థం కాలేదు చౌదరికి.

కాని అన్నాడు అంటే ఏదన్నా చేయగల రంగధాంపై చాలా గురి వుండటంతో నిశ్శబ్దంగా వుండిపోయాడు.

"రాజేంద్ర..." పైకి లేస్తూ అన్నాడు రంగధాం "యధాప్రకారం ఆదివారం సాయంకాలం 'ఐక్యూ' కాంపిటీషన్‌కి నువ్వెళుతున్నావు... నువ్వే గెలుస్తున్నావ్"

0 0 0 0

ఆదివారం సాయంకాలం అయిదున్నర గంటల సమయం...

ఆకాశం మేఘావృతమై వుంది...

అప్పటికే యూనివర్శిటీ ఆడిటోరియం విద్యార్థులతో నిండిపోయి వుంది.

రాజేంద్ర గెలుపుకి సాక్ష్యంగా వుండాలనుకున్న రెండు వందల మంది విద్యార్థులు ఓ పక్క సెటిలై ఆసక్తిగా డయాస్‌వేపు చూస్తున్నారు.

చాలా అరుదైన పోటీ అది.  నిజానికి అది రాజేంద్ర - విశ్వనాథ్‌ల మధ్య కాదు.  రెండు పెద్ద సంస్థల మధ్య ఇద్దరు శక్తివంతులైన కోటీశ్వరుల మధ్య పోరాటం.

ఆ విషయం నగరం నలుమూలలా ప్రాకడంతో కేవలం యూనివర్శిటీ విద్యార్థులే కాక పత్రికా విలేకర్లు కూడా అక్కడికి చేరుకున్నారు.

డయాస్‌కి అభిముఖంగా ముందు వరుసలో కూర్చున్న కృషి యిదేమీ

రాజేంద్రని గమనిస్తుంది.

క్విజ్ పోటీ నిర్వహణకి ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా ఆహ్వానించిన సత్యేంద్రబసు అతడి సహాయకురాలితో చర్చిస్తున్నాడేదో.

రిస్ట్‌వాచ్ చూసుకుంది కృషి.

అయిదు గంటల నలభై అయిదు నిముషాలు. . .

ఇంకా మిగిలింది పదిహేను నిముషాలు మాత్రమే.

ఖచ్చితంగా ఆరు గంటలకల్లా పార్టిసిపెంట్స్ యిద్దరూ క్విజ్ మాస్టర్ సమక్షంలో వుండాలి.

ఒక్క నిముషం ఆలస్యం జరిగినా పోటీలో పాల్గొనటానికి అనర్హులైపోతారు.

కొద్దిపాటి అసహనంతో ఆడిటోరియం బయటికి వచ్చి నిలబడింది కృషి.

మిగిలింది పది నిముషాలు మాత్రమే.